# చెత్త పనులు మానాల్సిందే

## అతిక్రమిస్తే జరిమానే..

## 50 మైక్రాన్ల కంటె మందమైన కవర్లే వాడాలి

## సిద్ధమైన 'ఘనవ్యర్థాల నిబంధనలు-2016'

ఆధునిక సమాజపు అతి పెద్ద సమస్యల్లో ఒకటి చెత్త. ఇది ఎప్పుడో ఒకసారి వచ్చిపోయేది కాదు, ప్రతి రోజూ జనించేది, నిత్య సమస్య. టన్నుల కొద్దీ ఉత్పత్తి అవుతున్న చెత్తను సరైన విధంగా వినియోగించక పోతే ఎన్ని స్థలాలు కేటాయించినా సరిపోవు, దానికితోడు వాతావారణంలో కాలుష్యం పెరిగిపోయి ప్రజలు రోగాల బారిన పడతారు. సమస్య తీవ్రతను గుర్తించిన ప్రపంచ దేశాలు చెత్త నిర్వహణకు నిబంధనలు రూపొందించుకున్నాయి. పాశ్చాత్య దేశాల తర్వాత మేలుకున్న మన దేశం 2000వ సంవత్సరంలో 'ఘనవ్యర్థాల నిబంధనలు-2000' పేరిట నిబంధనలు రూపొందించి దేశంలోని అన్ని నగరాలు, పట్టణాల్లో వీటిని అమలు చేయాలని ఆదేశాలు ఇచ్చింది. ఆ తర్వాత 16 సంవత్సరాలకు పాత నిబంధనలను మరింత ఆధునీకరించి, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఘనవ్యర్థాల నిబంధనలు-2016 తయారు చేసింది. కేంద్ర ప్రభుత్వ పర్యావరణ-అటవీశాఖలు సంయుక్తంగా వీటిని రూపొందించి తాజాగా కేంద్ర ప్రచార సంస్థలకు అప్పగించాయి. త్వరలోనే ఇవి నోటిఫికేషన్లుగా మారి అన్ని నగరాలు, పురపాలక సంఘాలకు చేరనున్నాయి.

- తెనాలి టౌన్, న్యూస్‌టుడే

### తాజా నిబంధనల్లోని ముఖ్యాంశాలు

- చెత్త ఎక్కడ ఉత్పత్తి అవుతుందో అక్కడి నుంచి 'తడి-పొడి-ఇతర' ఇలా మూడు రకాలుగా సేకరించాలి. శానిటరీ నాప్‌కిన్స్ వంటివి మూడో రకానికి చెందుతాయి.




- ప్రతి నివాస గృహం, అపార్ట్‌మెంట్, గృహ సముదాయాలు ఈ నిబంధన పాటించాల్సిందే.
- రోడ్లు, కాలువల్లో చెత్త వేసినా, చెత్తను మూడు రకాలుగా వర్గీకరించి అందించకపోయినా అపరాధరుసుము చెల్లించాల్సిందే.
- పేదలు తప్ప మిగిలిన వారందరూ చెత్త సేకరణకు యూజర్ ఛార్జీలు చెల్లించాల్సిందే. వారు ఉత్పత్తి చేసే చెత్తను అనుసరించి ఈ ఛార్జీలు ఉంటాయి. ఉదాహరణకు హోటల్స్, పాఠశాలలు, సినిమా హాల్స్ వంటి వాటికి

### ప్లాస్టిక్ నిబంధనలు మరింత కఠినం

ఇప్పటి వరకు 40 మైక్రాన్ల కంటె మందం ఉన్న కవర్లను వాడే అవకాశం ఉండగా, తాజా నిబంధనల్లో దీనిని 50 మైక్రాన్లు చేశారు. అంటే అంతకంటె పల్చటివి వాడకూడదు. ఎవరైతే ప్లాస్టిక్ వ్యాపారం చేస్తారో వారు ముందుగా స్థానిక సంస్థల్లో ప్రత్యేక రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుంది.





'కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 16 ఏళ్ల నాటి నిబంధనలే అమలు కాని వైనం'



### మార్పు అవసరం

నవ్యాంధ్ర, అందునా రాజధాని ప్రాంతం ప్రపంచ దేశాల్లో గుర్తింపు పొందాలన్నా, తన ప్రత్యేకతను చాటాలన్నా వ్యర్థాల నిర్వహణలో మార్పు, నిబంధనల అమలుపై నిబద్ధత అవసరం. ప్రయత్నిస్తే సాధ్యం కానిది లేదు, నిబంధనలు అమలు కానిది లేదు. ఇప్పటికే దిల్లీ, బెంగళూరు, రాయ్‌పూర్ వంటి నగరాలు ఈ తరహా నిబంధనలు పక్కాగా అమలు చేస్తున్నాయి. ఆయా నగరాలు పరిశుభ్రతకు మారుపేరుగా గుర్తింపు కూడా పొందాయి. మన పాలకులు, అధికారుల ఆలోచనల్లో మార్పు, ప్రజల్లో అవగాహన కల్పించటం మాత్రం అవసరం. నిబంధనల అమలులో నవ్యాంధ్ర రాజధాని ప్రాంతం వెనుకబడిపోతుందన్న మాట లేకుండా ఇప్పటి నుంచే కసరత్తు అవసరం. నూతన నిబంధనలు పక్కాగా అమలు చేయటానికి సన్నాహాలు చేపట్టాలి. ఈమేరకు తెనాలిలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు కాలనీల్లో జోరుగా సాగుతున్నాయి.

### వేడుకలు, కార్యక్రమాల సమాచారం ముందుగా తెలపాలి

కల్యాణమండపాలు, నివాస గృహాల మధ్య నిర్వహించనున్న కార్యక్రమంలో ఆహార వ్యర్థాలు వంటివి ఉత్పత్తి అవుతాయనుకుంటే వారు ముందుగా ఆయా నగరాలు, పట్టణాల అధికారులకు సమాచారం ఇవ్వాలి. సంబంధిత ప్రాంత సిబ్బంది పరిశీలించి ఉత్పత్తి అయ్యే చెత్తను గుర్తించి, నిబంధనల మేరకు సూచించిన మొత్తాన్ని సంబంధితులు చెల్లించాలి. ఆ చెత్తను తరలించటానికి ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతాయి.

### అధికారులదే బాధ్యత

చెత్త సేకరణ, వాటిని నూరుశాతం వినియోగం చేయటం అన్నది ప్రధానాంశం. నిబంధనల అమలు బాధ్యత పక్కాగా అధికారులదే. బాగా చేసిన వారికి గుర్తింపుతో పాటు నిబంధనలు అమలు చేయని వారికి జరిమానాలు, తొలగింపులు తుదకు విచారణ వంటి కఠిన చర్యలు అమలు చేస్తారు.

### కృష్ణా-గుంటూరు జిల్లాల్లో పాత నిబంధనలకే దిక్కులేదు

2000వ సంవత్సరంలో రూపొందించిన నిబంధనలనే కృష్ణాగుంటూరు జిల్లాల్లోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు అమలు చేయలేకపోయాయి. ఈ రెండు జిల్లాలలోని నగరాలు, పురపాలక సంఘాల్లో ప్రతిరోజూ ఉత్పత్తి అవుతున్న చెత్త 1700 టన్నులు. పాత నిబంధనల ప్రకారం వీటిని ఇంటింటి నుంచి నేరుగా సేకరించాల్సి ఉండగా దాదాపు 50 శాతం మాత్రమే ఇది జరుగుతుంది. మిగిలినది రోడ్డు మీద నుంచే తరలిస్తున్నారు. అదే విధంగా ఉత్పత్తి అవుతున్న ప్రాంతం నుంచే తడి-పొడిగా సేకరించాల్సి ఉండగా అది సగానికి సగమే ఉంది. తెనాలి, విజయవాడ, సత్తెనపల్లి, చిలకలూరిపేట, నూజివీడు వంటి ప్రాంతాల్లో తడిపొడి చెత్త సేకరణ దాదాపు 70 శాతం ఉండగా, మిగిలిన ప్రాంతాల్లో 50 శాతానికి లోపుగానే ఉంది. చెత్త సేకరణ తీరే ఇలా ఉంటే నిర్వహణ ఎలా ఉంటుందో విడిగా చెప్పనవసరం లేదు. అంతా దిబ్బలుగానే ఉంటుంది. ఇక ప్లాస్టిక్ నిషేధం గురించి ఎంత తక్కువగా మాట్లాడుకుంటే అంత మంచిది. రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు సంబంధించిన ఏదైనా సమాచారం అడిగినప్పుడో, కొత్త ఆదేశాలు వచ్చినప్పుడు అప్పటికప్పుడు హడావుడి చేయటం తప్పించి, నిర్దిష్టంగా 40 మైక్రాన్ల నిబంధనలు ఎక్కడా అమలు కాలేదు. విజయవాడ, మచిలీపట్నం, తెనాలి, సత్తెనపల్లి, బాపట్ల వంటి చోట్ల అప్పుడప్పుడు కొంత మార్పు వచ్చినా అది మూన్నాళ్ల ముచ్చటే అయింది. ఇప్పుడు తాజాగా గుంటూరులో కొత్త హడావుడి మొదలయింది. ఇది ఎన్ని రోజులుంటుందో చూడాలి